# తుఫాను బాధితుడు




పిసుపాటి ఉమామహేశ్వరమ్

**ఉపక్రమణిక :**

నవంబరు 19-1977.

సమయం- రాత్రి.

సాయంత్రం నుంచీ పెరుగుతూ వస్తూన్న జల్లు, చిలికి చిలికి గాలి వానైంది. గాలి పెనుగాలిగా మారింది. వాన మరింత విజృంభించింది. రెండూ కలిసి తుపానుగా మారేయి. తుపాను పెనుతుపాను అయింది. కడలిలోని కెరటాలు ఉవ్వెత్తున లేచేయి ఆ ధాటికి. ఆ క్షణంలో ప్రకృతి ప్రళయ తాండవం చేసింది. ఒక్క క్షణంలో ఆంధ్రాలోని కోస్తా తీర

ప్రాంతాలన్నీ తుడిచి పెట్టుకుపోయేయి దివి సీమ వేపు. కను మూసి తెరిచే లోపల ప్రాణ నష్టం, ఆస్థి నష్టం, నష్టం.... అంతా నష్టం. నాశనం.... నాశనం- అంతా సర్వ నాశనం.

కథ ప్రారంభం:

In view of the havoc Played by the recent Cyclone, it has been decided to...... అంటూ మొదలైన సర్క్యులర్ "ఇటీవల ఆంధ్ర దేశంలో చెల రేగిన తుపాను, ఉపద్రవించిన ఉప్పెన, ఆంధ్రా కోస్తా తీర ప్రాంతాలకి ఎంతో తీవ్ర నష్టాన్ని కలిగించిందనీ, జరిగిన వందేళ్ళ లోనూ కనీ వినీ ఎరుగని ఈ నష్టానికి గురైన ప్రజానీకంలో మన బ్యాంక్ స్టాఫ్ గూడా ఉండడం ఎంతో దుఃఖకరమైన విషయమనీ, ప్రత్యక్షంగానో పరోక్షంగానో జరిగిన నష్టాన్ని అంతా భర్తీ చేయడం అసాధ్యమైన విషయం కాబట్టి రిలీఫ్ మెజర్‌గా ఎఫెక్టెడ్ పెర్సన్స్‌కి 1500 రూ॥ లు ఎడ్వాన్స్ యివ్వడానికి మానేజ్‌మెంట్ నిశ్చయించిందనీ, ఇంట్రస్ట్ లేని ఈ లోను రెండేళ్ళలోగా తీర్చాలనీ, లోను తీస్కున్న నెల్రోజుల్లోపు డామేజ్ సర్టిఫికేట్ ప్రొడ్యూస్ చెయ్యాల"నీ సారాంశాన్నందించే సరికి ఆనందంతో ఎగిరి గంతేసేరు 'స్వరాజ్య' బ్యాంక్ స్టాఫంతాను.

సాధారణంగా ఏ ఆఫీసు స్టాఫైనా 'రెలిజియస్'గా ఆఫీస్‌కెళ్ళేది అందినంత వరకూ మానేజ్‌మెంట్ నుండి ఎంత వరకూ దండు కోగలమా అన్న ఆలోచనతోనే. బ్యాంక్ స్టాఫైతే మరీను.

జీతమెంతెక్కువైతే అవస రాలంత పెరుగుతాయి కొందరికి. అవసరాలు అప్పులు చేయిస్తాయి. తద్వారా జీతంలో కటింగు లెక్కువౌతాయి. అ(న)వసరాలకి కటింగు పెట్టుకోలేనివాడు జీతంలో కటింగులకి భయపడ్డం మానేస్తాడు. ఒక అప్పు తీర్చడానికింకో అప్పు, దాన్ని తీర్చడానికి మరో అప్పు- అలా బ్రతుకే బాకీ బ్రతుకై పోతుంది.

అలాంటి బాకీ బతుకుగాళ్ళందరూ భక్తిగా కళ్ళకద్దుకున్నారు ఆ సర్క్యులర్ని.

క్షణం ఆలస్యం చేయకుండా ఆ సర్క్యులర్ వెనకనే ఎటాచ్ చేయబడిఉన్న ప్రొఫార్మాని చకచకా

టైపు కొట్టి వీలైనన్ని కాపీలు లాగి, టకటకా పూర్తి చేసి ఏజెంట్ మొహాన పడేసి పీకెల మీద కూర్చుని శాంక్షన్ చేయించుకుని కరకరలాడే కరకు నోట్లని జేబులో కుక్కుకుని హాయిగా శ్వాస పీల్చేరు.

తుపాను తాకని జిల్లాల వాళ్ళకి అసూయ వేసింది వీళ్ళని చూస్తూంటే.

'అన్యాయం గురూ! మీకెందుకు లోను? ఏమీ డామేజ్ లేదు కదా' అనెవరన్నా అంటే 'తప్పు గురూ! అలా అనకండి, తుపాను బాధితులం. అసలే పుట్టెడు దుఃఖంలో ఉన్నాం. ఏమీ అనకండి. తట్టుకోలేం' అన్నారు కృష్ణా, గోదావరి జిల్లాలవాళ్ళు.

ఒక్కసారిగా 1500 ఇంట్రస్ట్ ఫ్రీ లోనిచ్చి రెండేళ్ళ టైమిచ్చే సరికి తమ ప్రాంతాలగ్గూడా తుపాను రాకపోయెనే అని చాలా మంది బాధపడ్డారు.

లోను తీస్కున్న వాళ్ళలో కొందరు కాబూలీ అప్పుల్నించి విముక్తి పొందేరు. కొందరు సొసైటీ లోన్నూ, గార్డ్ లోన్నూ, పి. యఫ్. లోన్నూ క్లోజ్ చేస్కుని ఎక్కువ కటింగ్స్‌లోంచి తక్కువ కటింగ్స్‌లో కొచ్చి, హెవీ ఇంట్రస్ట్

## తుఫాన్ కక్ష

నుండి విముక్తి పొందేరు. అటువంటి బాధల్లేని వారు కొందరు వెంటనే ఫిక్సెడ్ డిపాజిట్స్ వేసేరు.

ఇవన్నీ లేని సుబ్బారావు ఎన్నాల్టి నుండో కొనాలనుకుంటూ కొనలేకపోతున్న ఇంపోర్టెడ్ కెమెరా కొనుక్కున్నాడు. వారం రోజులు సెలవు పెట్టి స్వగ్రామమైన అవనిగడ్డ వెళ్ళి, తల్లిదండ్రుల్నీ, మిగతా బంధువుల్నీ ఓసారి పరామర్శించి చుట్టుప్రక్కల గ్రామాలన్నీ తిరిగి, భీభత్స ప్రాంతాలన్నీ సర్వేజేసి, అందమైన అల్లకల్లోల దృశ్యాలన్నిటినీ ఫోటోలు తీసుకొచ్చి పెద్ద ఆల్బం తయారు చేసుకొచ్చేడు.

కొన్నాల్టి వరకూ ఆఫీసులో తుపాను చర్చలే. తుపాను తాకిడి ప్రాంతాల్ని ప్రత్యక్షంగా చూడలేని వాళ్ళందరికీ సుబ్బారావు తయారు చేసిన ఆల్బం అద్దం పట్టినట్టు చూపించింది.

సమస్యల్నుంచి బైటపడి సంతోషంగా ఉన్న స్టాఫ్, కొన్నాళ్ళ తర్వాత ఏజెంటు గుర్తు చేస్తేనే కానీ ఇహలోకంలో కొచ్చి

పళ్ళేదు.

డామేజ్ సర్టిఫికేట్ సబ్‌మిట్ చెయ్యాలన్న చేదు కర్తవ్యాన్ని గుర్తు చేసిన ఏజెంట్‌ను మింగెయ్యాలన్నంత కోపం వచ్చింది అందరికీను.

సర్క్యులర్‌లో ఓ క్లాజుంది- ఎడ్వాన్స్ తీస్కోడానికి ఎంప్లాయీ దగ్గర్నుండి- తుపాన్ వల్ల నా ఆస్థికింత నష్టం సంభవించింది- అని ఒక అండర్ టేకింగ్ తీస్కుంటే చాలు.

ఏ పరిస్థితిలోనైనా ఏజంటుకు ఆ అండర్ టేకింగ్ అసంతృప్తిని కలించిన పక్షంలో నెల రోజుల్లోపల డామేజ్ సర్టిఫికేట్ సబ్మిట్ చెయ్యాలి అని దాని భావం.

అంచేత కొందరు రాయబారం సాగించేరు.

'తుపానెంత తీవ్ర నష్టాన్ని కలగజేసిందో ఓ పక్క రేడియోలూ పత్రికలూ హృదయవిదారకంగా ఘోషిస్తూనే ఉన్నాయికద సార్. వేరే డామేజ్ సర్టిఫికేట్లెందుకు?'

ఏజెంటు తల అడ్డంగా ఊడించి నవ్వేసేడు.

ప్రొసీజరు ప్రొసీజరే.

"ముంచుకొచ్చిన ఉప్పెన బారి నుండి కొందరు మొండి ప్రాణాలు బతికి బయట పడగాలేంది. పరామర్శించి పోయిన తుపానుకి మీ అందరి ఆస్థులూ భూస్థాపిత మయ్యేయంటే నమ్ముతుందా మానేజ్‌మెంట్? సర్టిఫికేట్స్ తెండి' అన్నాడు.

గత్యంతరం లేక తిట్టుకుంటూనో, విసుక్కుంటూనో సెలవులు పెట్టుకునెళ్ళో, వాళ్ళవాళ్ళకి రాసి తెప్పించుకునో- మొత్తానికి నానా తంటాలూ పడి సర్టిఫికేట్స్ సంపాదించి ఏజెంట్ మొఖాన కొట్టేరు.

ఆ ప్రహారం ఆ ప్రకరణం ముగిసి ప్రజలు స్థిమితంగా ఉన్నవేళ ఉన్నట్టుండి ఉప్పెన కెరటంలా ఏజెంట్ నుండి శ్రీముఖం ఒకటి విరుచుకు పడింది సుబ్బారావు మీద.

'అవనిగడ్డ ఏజెంటు జరిపిన సీక్రెట్ సర్వే ప్రకారం నీవు ఉదహరించిన నష్టం నీ ఆస్థికి ఏమీ జరగనట్టు వెల్లడైంది. గనుక దీనికి నీ సంజాయిషీ ఏమిటి? నీ డామేజ్ క్లెయిమ్ మీద ఓపెన్ ఎంక్వైరీ ఎందుకు చేయరాదు? తప్పుడు క్లెయిమ్ పెట్టి మానేజ్‌మెంట్‌ని చీట్ చేసినందుకు నీ మీద క్రమశిక్షణ చర్య ఎందుకు తీసుకోకూడదు? దయవుంచి కారణాలు వివరించవలసినది'—

సీట్లో బాంబు పేలినట్లయింది సుబ్బారావుకి.

స్టాఫందరికీ దిమ్మ తిరిగి పోయింది.

అందరూ ప్రొడ్యూస్ చేసినవీ అంతంత మాత్రంసర్టిఫికేట్లే. తమ మీద గూడా సీక్రెట్ ఎంక్వైరీలు జరుగుతున్నాయేమోనని హడిలి పోయేరు.

ఆ రోజు చిన్న సైజు భూకంపం వచ్చినట్లయింది ఆఫీసులో.

సుబ్బారావు విషయంలో మిగతా కర్మకాండంతా చకచకా జరిగి పోయింది.

షో కాజ్ నోటీసుతో కదిలిన వ్యవహారం మెమోలు, ఛార్జ్ షీట్లమీదుగా సాగి సస్పెన్షన్ వగైరా స్టేషన్లన్నిదాటి తుదికి డిస్మిస్ అనే కార్యక్రమంతో అంతమైంది.

అంతమందిలోకి ఒక్క సుబ్బారావు మీదే ఇంత తతంగం జరగడానికి గల కారణం కాలక్రమేణా బోధపడింది స్టాఫ్కి.

అందర్లోకీ సుబ్బారావు పని దొంగ. పైగా పోట్లాట్రాయుడు. కొన్నాళ్ళు యూనియన్ సెక్రట్రీగిరీ వెలగబెట్టేడు.

నానా దీనా ఏజెంటుకీ సుబ్బారావుకీ ఎప్పుడూ పడేది కాదు. ఎన్నాళ్ళగానో సుబ్బారావును సాధించడానికి చూస్తున్న ఏజెంట్‌కు ఈ అవకాశం దొరికింది.

దొరికిన అవకాశాన్ని సద్వినియోగపర్చుకుని సుబ్బారావుని యింటికి పంపి విజయ గర్వంతో చేతులు కడుక్కున్నాడు ఏజెంటు.

ఉపసంహారం :

ఇటీవల ఆంధ్రదేశంలో వచ్చిన తుఫానుకీ, ఉప్పెనకీ ఎన్నో వూళ్ళు కొట్టుకుపోయేయి. ఎంతో ప్రాణ నష్టం, ఆస్థి నష్టం, సంభవించింది. ప్రకృతి చేసిన ఆ విలయ తాండవానికి ప్రపంచమంతా విస్తుపోయింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలూ, మిగతా స్వచ్ఛంద సంస్థలూ, అశేష ప్రజానీకమే కాకుండా, ప్రపంచ నలుమూలల్నుంచీ తుపాను బాధితుల్నాదుకోడానికి నడుం కట్టడం జరిగి ఎన్ని రకాలుగానో సహాయ కార్యక్రమాలు అమలు పరచడం జరుగుతోంది. సర్వీస్ నుంచి డిస్మిస్ కాబడి సంసారంతో పడి వీధిలో నిలబడ్డ సుబ్బారావు ఈ సహాయాల్లో ఏదీ అందుకోడానికి అర్హుడు కాకపోయినా- అతనూ తుపాను బాధితుడే. ●